క్లుప్తంగా

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న ఓంకార్ భరద్వాజ్

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి చంద్రగిరికి చెందిన ఓంకార్ భరద్వాజ్ రూ.1.10 లక్షల విరాళం ఇచ్చారు. ఆయన సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి నగదును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ రామకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు మురళీ కిషోర్‌కు సన్మానం



మురళీ కిషోర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లి పంచాయతీ పద్మవల్లిపురంలో సోమవారం వినరో భాగ్యం విష్ణుకథ సినిమా దర్శకుడు అబ్బూరు మురళీ కిషోర్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన మురళీ కిషోర్ సినిమాకు దర్శకత్వం వహించడం సంతోషంగా ఉందన్నారు.

సర్వే కిట్ల పంపిణీ



తిరుపతి అర్బన్: సర్వే పూర్తయిన భూముల్లో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం సర్వేకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా 200 గ్రామాలకు చెందిన విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలకు కిట్లు వచ్చినట్టు తెలిపారు. జేసీ డీకే బాలాజీ, తిరుపతి ఆర్డీవో కనకనరసారెడ్డి, జిల్లా సర్వే ఏడీ జయరాజ్ పాల్గొన్నారు.

వాకర్స్ డెప్యూటీ గవర్నర్‌గా జగన్నాథం



తిరుపతి కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ డెప్యూటీ గవర్నర్‌గా జగన్నాథం ఎంపికయ్యారు. తనను డెప్యూటీ గవర్నర్‌గా ఎంపిక చేసినందుకు గవర్నర్ రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు జగన్నాథం కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ మస్తానమ్మకు సత్కారం



మస్తానమ్మ దంపతులను సత్కరిస్తున్న సాహిత్య సంస్థలు, బీసీ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: అధికార భాషా సంఘం సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ మస్తానమ్మకు విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు మాట్లాడుతూ మస్తానమ్మ సాహిత్య పీఠం స్థాపించి తెలుగు భాష, సాహిత్యానికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆమెకు సముచిత స్థానం లభించిందని తెలిపారు. అనంతరం మస్తానమ్మను మానవ వికాస వేదిక సమన్వయకర్త సాకం నాగరాజు, రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ ఎం.పురుషోత్తంరెడ్డి, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, అక్కనపల్లి లక్ష్మయ్య, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధులు తమటం రామచంద్రారెడ్డి, టెంకాయల దామోదరం, కసిరెడ్డి లలితమ్మ, వాకా ప్రసాద్, ప్రముఖ వైద్యురాలు కృష్ణప్రశాంతి అభినందించారు.

వేడుకగా త్రిశూల స్నానం



తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం ఉదయం త్రిశూల స్నానం వేడుకగా చేపట్టారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు నటరాజస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగితూ భక్తులను అనుగ్రహించారు. 9 గంటలకు కపిల తీర్థంలోని పుష్కరిణిలో అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం చేసి శాంతి చేకూర్చారు. పూర్ణాహుతి, కలశోద్వాసనం, మూలవర్లకు కలశాభిషేకం చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల మధ్య ధ్వజావరోహణం చేసి బ్రహ్మోత్సవాలను ముగించారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు రావణాసుర వాహన సేవను కనుల పండువగా చేపట్టారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

14 ఏళ్లలో ఏమి చేశావు బాబూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

- మాట తప్పని.. మడం తిప్పని నాయకుడు జగనన్న
- కరోనా సమయంలోనూ పేదలకు సంక్షేమ పథకాలు
- చేసిన మంచిని ప్రజలకు వివరించండి
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం

తిరుపతి మంగళం : అధికారంలో ఉన్న 14 ఏళ్లలో ఏమి చేశావని ప్రజలు ఓట్లు వేయాలో చంద్రబాబు నాయుడు చెప్పాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. స్థానిక డీపీఆర్ కల్యాణ మండపంలో సోమవారం తిరుపతిలోని 50 డివిజన్లలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ పరిశీలకులు ప్రసాద్‌రెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం హామీలను నెరవేర్చి «మాట తప్పని.. మడం తిప్పని» నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారని వివరించారు. 2.24 కోట్ల మందికి రూ.3.18 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒక్క సంక్షేమ పథకాన్నీ అందించలేదని మండిపడ్డారు. జన్మభూమి కమిటీలు వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఒక్కొక్కరి అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడడం చంద్రబాబు అరాచకానికి నిదర్శనమన్నారు.

ప్రజలతో మమేకంకండి

జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలతో మమేకం కావాలన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక మేలు జరిగిందా? లేదా అని ప్రశ్నించి, ఈ ప్రభుత్వం బాగుందా, చంద్రబాబు ప్రభుత్వం బాగుందా అన్న ప్రశ్నలకు ప్రజల సమాధానం తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, ఉదయగిరి రమేష్, మద్దాలి శేఖర్ పాల్గొన్నారు.

తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యం



మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్లు

తిరుపతి తుడా: తిరుపతి నగరాభివృద్ధే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళుతున్నామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లతో కలిసి గొల్లవానికుంట, పూలవానిగుంట మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి నగర విస్తరణ జరుగుతుందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టా శివశంకర్‌రెడ్డి, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపి, మార్కెట్ వంశీ, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 127 మంది ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీవీఎస్. చక్రవర్తిరెడ్డి

తిరుపతి కల్చరల్: న్యూ బాలాజీ కాలనీలో ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 127 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఉషా తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ సంస్థలు టెక్ మహేంద్ర, హెటిరో ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఇందులో టెక్ మహేంద్ర కంపెనీకి 103 మంది, హెటిరోకు 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధినేత డీవీఎస్.చక్రవర్తిరెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న తమ విద్యార్థుల్లో ఇప్పటికే 400 మందికి పైగా ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి మహదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి: త్వరలో జరగనున్న ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తహసీల్దార్ శిరీష తెలిపారు. ఆమె సోమవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతాయన్నారు. మండలంలో పట్టభద్రులు ఓటు కోసం చేసుకున్న దరఖాస్తులను మరోసారి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తప్పులకు తావు లేకుండా దరఖాస్తుతోపాటు డిగ్రీ పట్టాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని వివరించారు. వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. చంద్రగిరి స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికకు బూత్ నంబరు 212, 213, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బూత్ నంబరు 110ను కేటాయించినట్లు తెలిపారు. మార్చి 16వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీటీలు ఈశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అమృత, ఆర్ఐ సులోచన, వినోద్, ఉషారాణి పాల్గొన్నారు.

ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఏబీఆర్‌ఎస్‌ఎమ్ రాష్ట్ర కమిటీ సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్ : అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎమ్) రాష్ట్ర నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఎస్వీయూలో ఆదివారం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలు, వివిధ యూనివర్సిటీలకు పలువురిని ఎన్నుకున్నారు. ఆ సంఘం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంతా లక్ష్మణ్‌జీ వివరాలను వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రామిరెడ్డి(ఎస్వీయూ), ఉపాధ్యక్షులుగా వాణి (పద్మావతి మహిళా వర్సిటీ), శివరామకృష్ణ (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ), శరత్ చంద్రశేఖర్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, బొమ్మసముద్రం), ప్రధాన కార్యదర్శిగా రంగనాథం (ప్రభుత్వ కళాశాల, అనంతపురం), కార్యదర్శులుగా బుల్లీదాస్, జగదీశ్, రాంబాబు, కోశాధికారిగా రాజశేఖర్, మహిళా రెప్రజెంటేటివ్‌గా శ్రీదేవి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగానికి రవిప్రసాద్, సెక్రటరియేట్ విభాగానికి మహేంద్రనాథ్ చౌదరి, స్టడీ సర్కిల్‌కు సంధ్యను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను ఆ సంఘం జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి నారాయణ్‌లాల్ గుప్తా అభినందించారు.

ముగిసిన టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న డెప్యూటీ ఈఓ స్నేహలత

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సోమవారం రాత్రి మహతి కళాక్షేత్రంలో బహుమతులు ప్రదానం చేశారు. సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ స్నేహలత మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఒత్తిడిని అధిగమించడానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 19 వరకు ఉద్యోగులకు క్రీడలు నిర్వహించినట్టు తెలిపారు. అంతకుముందు టీటీడీ ఉద్యోగుల పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన టీటీడీ ఉద్యోగి చీర్ల కిరణ్‌కు రూ.60 వేల విలువైన క్రికెట్ బ్యాట్‌ను అందజేశారు. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఉషారాణి, తెలుగు విభాగాధిపతి క్రిష్ణవేణి, టీటీడీ ఈఈలు జగన్మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున ప్రసాద్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఎస్వీ డబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహదేవమ్మ, ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ



మాట్లాడుతున్న జేఈవో సదాభార్గవి

తిరుపతి తుడా: కోవిడ్ అనంతర పరిణామాల నేపథ్యంలో ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోందని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. విద్యార్థులు బాగా చదివి లోతైన పరిజ్ఞానం సంపాదిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాలలో సోమవారం 2022–23 బ్యాచ్ విద్యార్థులకు 15 రోజుల శిక్షణ ప్రారంభమైంది. జేఈవో మాట్లాడుతూ భారతీయ సనాతన వేదాలతో మిళితమై ఉన్న ఆయుర్వేద వైద్యాన్ని ప్రపంచమంతా ఆదరిస్తోందన్నారు. కోవిడ్ సమయంలో ఆయుర్వేద కషాయాలు, మందులు వాడారని పేర్కొన్నారు. సామాజిక, వాతావరణ మార్పుల వల్ల జబ్బులు వస్తున్నాయని, వాటిని పూర్తిగా నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందన్నారు. టీటీడీ ఆయుర్వేద కళాశాలలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ కళాశాల ప్రగతి, ఇక్కడి విద్యార్థులు సాధించిన విజయాలు, అందుకున్న ఉన్నత స్థానాల గురించి వివరించారు. ఆస్పత్రి అభివృద్ధి, నిర్వహణపై సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాజేంద్రబాబు

చంద్రగిరి: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాజేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాతపేట ఎంపీపీ పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు నిర్మల పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ అధ్యక్షుడిగా రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ, గౌరవ అధ్యక్షురాలిగా సుజాత, సహాధ్యక్షురాలిగా రామిరెడ్డి లక్ష్మీ, కోశాధికారిగా చెంచయ్య ఎన్నికయ్యారు.

25న తలకోన మారుపొంగళ్లు

ఎర్రావారిపాళెం: తలకోన సిద్ధేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం సిద్ధపూజ మహోత్సవంతో ముగిసిన విషయం తెలిసిందే. ఉత్సవాలు ముగిసిన మరుసటి వారం మారుపొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో మారుపొంగళ్లు నిర్వహించనున్నట్టు ఈవో జయకుమార్ తెలిపారు. శనివారం రాత్రి జాగరణ, వరపడుట, ఆదివారం మధ్యాహ్నం సిద్ధపూజ మహోత్సవం నిర్వహిస్తామన్నారు.

రేపు మండల సమావేశం

ఎర్రావారిపాళెం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ శివలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అమరనాథ్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తలకోన సిద్ధేశ్వరస్వామికి రూ.8 లక్షల ఆదాయం

ఎర్రావారిపాళెం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయానికి రూ.8,33,519ల ఆదాయం వచ్చిందని ఈవో జయకుమార్ తెలిపారు. తాత్కాలిక హుండీ ద్వారా రూ.1,68,219, ప్రత్యేక ప్రవేశ టోకెన్ల ద్వారా రూ.6,65,300లు వచ్చినట్లు పేర్కొన్నారు. నగదును సోమవారం నెరబైలు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమచేసినట్లు తెలిపారు.

శేష, భూత వాహనాలపై ఆదిదేవుడి చిద్విలాసం



శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని తొండవాడ సమీపంలోని అగస్తీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేష అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటలకు ఆదిదంపతులు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి భూత వాహనాన్ని అధిష్టించి ఊరేగారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



వాయిద్య కచేరి నిర్వహిస్తున్న కళాకారులు



మాట్లాడుతున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: స్థానిక ధర్మరాజుల ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాదస్వర విద్వాంసులు శరత్‌బాబు, వేణుగోపాల్, రాము, డోలు వాయిద్య కళాకారులు నరేంద్ర, సునీల్ కుమార్, మోహిత్ ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి 10 గంటలకు ప్రారంభమైన నాదస్వర కచేరిలో వి.కోటకు చెందిన మురళీ, బాలాజీ, గణేష్, డోలు విద్వాన్ మనోహర్ తమ గానంతో ఆహూతులను తన్మయత్వంలో ముంచెత్తారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను ప్రతి ఏటా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు పండ్లూరు మునిరత్నంను అభినందించారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట



స్వీట్లు పంచుతున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి, గౌరి

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట వేసినట్టు ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. వన్నెరెడ్డి కులానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం తుమ్మలగుంటలో సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచారు. ఆయన మాట్లాడుతూ 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 బీసీలకు, మరో మూడు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడం బలహీన వర్గాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంకితభావానికి నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీ కేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దొడ్ల గౌరి, పద్మ, సుబ్రమణ్యం, మునిరాజ, రేవంత్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన అవసరం

తిరుపతి తుడా: పెంపుడు జంతువుల నుంచి వ్యాపించే జూనోటిక్, జునోసిస్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. స్విమ్స్ వైరాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జూనోసిస్ వ్యాధులు, నియంత్రణ చర్యలపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు, జంతువులకు సైతం అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. వాటికి ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని, శుభ్రంగా ఉంచాలని సూచించారు. వైరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉష కళావత్, న్యూఢిల్లీకి చెందిన ఐఎస్పీపీ డైరెక్టర్ డాక్టర్ అజిత్ షెవాలే, డాక్టర్లు రామ్, రమేష్, నారాయణ, ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వం, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలపై సమీక్ష

తిరుపతి అలిపిరి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు వార్షిక కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. ఆయన సోమవారం వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. అదేవిధంగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం, తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో మార్చి 2 నుంచి 8 వరకు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపైనా సమీక్షించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: బంగారు నగల చోరీ కేసులో పులి నరేష్‌కు 71 రోజులు జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. గత ఏడాది అక్టోబర్ 29న తిరుపతి డీఆర్ మహల్ రోడ్డులోని టీటీడీ గోవిందరాజనగర్ క్వార్టర్స్‌లోని ఓ ఇంటిలో రూ.1.16 లక్షల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాధితుడు దొరైరాజ్ ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు నరేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.